క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతలో అంతా భాగస్వామ్యం కావాలి



అఫీషియల్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ : పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వామ్యం కావాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. మంగళవారం ఆయన 30వ వార్డు అఫీషియల్ కాలనీ, అజంతా రోడ్డు, రెల్లివీధి ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలతో మాట్లాడారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాలకు గురి కాకుండా ఉంటామన్నారు. పారిశుధ్య కార్మికులకు సహకరించాలన్నారు. ఇంట్లో చెత్తను మూడు రకాలుగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. అనంతరం వార్డులో ఉన్న వీధులన్నీ పరిశీలించారు. కాలువలు, గెడ్డలు, రహదారులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం అందించండి

మహారాణిపేట : అనారోగ్య సమస్యలతో కేజీహెచ్‌కు వచ్చే గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ ఆదేశించారు. మంగళవారం కేజీహెచ్‌లో ఉన్న ట్రైబల్ సెల్‌ను ఆయన సందర్శించారు. రాజేంద్రప్రసాద్ వార్డులో వైద్యం పొందుతున్న గిరిజనులు, విద్యార్థులను పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పొందుతున్న గిరిజనులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల 268 మంది విద్యార్థులు వివిధ అనారోగ్య సమస్యలతో కేజీహెచ్‌కు చేరారన్నారు. వారిలో 247 మంది పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి అయ్యారన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అల్లిపురం : ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏబిటీయూసీ) విశాఖ జిల్లా నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా గౌరవాధ్యక్షుడిగా జీఎస్‌జే అచ్యుతరావు, అధ్యక్షుడిగా ఎస్. సూర్యప్రకాష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డి.మణికంఠ, కార్యదర్శిగా సీహెచ్ ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఎ.ఎస్.మధు, నిర్వాహక కార్యదర్శిగా జి. సురేష్, సమాచార కార్యదర్శిగా జి. శ్రీను ఎన్నికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీవీ మంజునాథ తెలిపారు.

తప్పుడు వార్తలు నమ్మొద్దు


తాటిచెట్లపాలెం : రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్)లో కానిస్టేబుళ్లు, ఎస్ఐల రిక్రూట్‌మెంట్ పేరిట వివిధ మాధ్యమాల్లో ప్రసారమవుతున్న తప్పుడు వార్తలను నమ్మొద్దని రైల్వే బోర్డు డీఐజీ శ్రీకా మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టీయూ ఎగ్జామ్‌నెట్ వెబ్‌సైట్‌లో ఆర్పీఎఫ్‌లో 4208 కానిస్టేబుళ్లు, 452 సబ్ ఇన్‌స్పెక్టర్స్ రిక్రూట్‌మెంట్ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోందని, దీనిలో ఎంతమాత్రం వాస్తవం లేదని తెలిపారు. ఇటువంటి నోటిఫికేషన్ ఏదీ రైల్వే శాఖ జారీ చేయలేదని, ఎవరూ నమ్మొద్దని రైల్వే బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో సైన్స్‌డేని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక ఆరోగ్య పరీక్షల శిబిరం జరిగింది. దీనిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రజల మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించే బాధ్యతను సైకాలజిస్టులు తీసుకోవాలన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విభాగంలో వివిధ మానసిక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, నగర ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎండీ ఎస్.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాలనాపరంగా ఏ ఒక్క వర్గాన్ని వదలకుండా అన్ని విధాలా సంక్షేమం అందజేస్తూ ఇదెలా సాధ్యమని చూసేవారు ఆశ్చర్యపోయేలా పాలన సాగిస్తున్నారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. ఇప్పటికే ఎన్నో పథకాలు అందజేస్తున్న ఆయన అక్కచెల్లెమ్మల కోసం ఆసరా అంటూ వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఆడపడుచులు తమ కాళ్లపై తాము నిలబడి చిరు వ్యాపారాలు చేసుకునేలా ఆర్థిక ఊతం అందజేస్తున్నారు. దీంతో అతివలంతా మళ్లీ జగనే సీఎం కావాలని ఎలుగెత్తి చాటుతున్నారు.

అతివలకు అండగా..



చిరువ్యాపారాలతో సొంత కాళ్లపై నిలబడ్డామంటున్న అక్కచెల్లెమ్మలు

ఆసరాతో బతుకునిచ్చిన సీఎం జగన్



ఆసరా సాయంతో కుండలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్న శ్రీకాకుళపు నాగమణి



ఆసరా సాయంతో చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న భీమరశెట్టి వరలక్ష్మి

దాబాగార్డెన్స్ : మహిళా సాధికారతే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ఆసరా. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సాయం అందుతోంది. నియోజకవర్గ పరిధిలో పలువురు మహిళలు ఆసరాతో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందడమే కాక కుటుంబ పోషణలో ముఖ్యులుగా నిలుస్తున్నారు. దీనిలో భాగంగా విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 4వ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు ఇటీవల ఘనంగా నిర్వహించారు. టర్నర్ చౌల్ట్రీ వేదికగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఆసరా సంబరాల్లో 2678 గ్రూపులకు గాను 26906 మంది సభ్యులకు రూ.65 కోట్ల 59 లక్షల 39 వేలు అందజేశారు. నియోజకవర్గ పరిధిలో తొలి విడతలో 2337 మహిళా సంఘాలకు గాను 23534 మంది అక్కచెల్లెమ్మలకు రూ.16 కోట్ల 11 వేల 500 లబ్ధి చేకూరింది. రెండో విడతలో 2668 మహిళా సంఘాలకు చెందిన 26841 మంది అక్క చెల్లెమ్మలకు రూ.16.23 కోట్ల లబ్ధి చేకూరింది. మూడవ విడతలో 2674 మహిళా సంఘాల 26866 మంది అక్క చెల్లెమ్మలకు రూ.16.33 కోట్ల లబ్ధి చేకూరింది. నాల్గో విడతలో 2678 మహిళా సంఘాలకు గాను 26906 మంది అక్క చెల్లెమ్మలకు రూ.16.93 కోట్లు అందజేసి జగనన్న ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.

నాల్గో విడతలో ఇలా..

27వ వార్డు నుంచి 162 సంఘాలకు గాను 1605 మంది అక్కచెల్లెమ్మలకు రూ.54 లక్షలు, 29వ వార్డు నుంచి 201 సంఘాలకు గాను 2014 మంది అక్క చెల్లెమ్మలకు రూ.1.49 కోట్లు, 30వ వార్డుకి సంబంధించి 192 గ్రూపులు.. 1924 మంది సభ్యులకు రూ.1.28 కోట్లు, 31వ వార్డు నుంచి 168 గ్రూపులు.. 1684 మంది అక్క చెల్లెమ్మలకు రూ.1.21 కోట్లు, 32వ వార్డుకి సంబంధించి 176 గ్రూపులు.. 1768 మంది అక్క చెల్లెమ్మలకు రూ.1.33 కోట్లు, 33వ వార్డు నుంచి 171 గ్రూపులు.. 1754 మంది అక్క చెల్లెమ్మలకు రూ.1.22 కోట్లు, 34వ వార్డు నుంచి 198 గ్రూపులు.. 2010 మంది అక్క చెల్లెమ్మలకు రూ.1.82 కోట్లు, 35వ వార్డు నుంచి 292 గ్రూపుల 2965 మంది అక్కచెల్లెమ్మలకు రూ.1.42 కోట్లు అందజేశారు. అలాగే 36వ వార్డుకి సంబంధించి 214 గ్రూపులు.. 2145 మంది సభ్యులకు రూ.1.51 కోట్లు, 37వ వార్డు నుంచి 298 గ్రూపులుండగా 2987 మంది అక్క చెల్లెమ్మలకు రూ.1.58 కోట్లు, 38వ వార్డు నుంచి 287 గ్రూపుల్లో 2874 మంది అక్క చెల్లెమ్మలకు రూ.1.98 కోట్లు, 39వ వార్డుకి సంబంధించి 171 స్వయం సహాయక గ్రూపులకు గాను 1691 మంది అక్క చెల్లెమ్మలకు రూ.1.26 కోట్లు, 41వ వార్డుకి సంబంధించి 148 గ్రూపులుండగా 1485 మంది అక్క చెల్లెమ్మలకు రూ.29 లక్షలు అందజేసి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా పక్షపాతి అనిపించుకుంది.

జగన్‌తోనే మహిళాభివృద్ధి..



జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళాభివృద్ధి సాధ్యపడుతుంది. దక్షిణ నియోజకవర్గంలో గల 2678 గ్రూపులకు గాను 26906 మంది సభ్యులకు ఇప్పటి వరకు ఆసరా కింద రూ.65 కోట్ల 59 లక్షల 39 వేలు లబ్ధి చేకూరింది. ఇచ్చిన మాట ప్రకారం అక్క చెల్లెమ్మలకు రాష్ట్ర వ్యాప్తంగా 6900 కోట్లు 80 లక్షల కుటుంబాల ఖాతాలోకి నేరుగా అందజేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ఒక్క రూపాయి అవినీతి లేకుండా పారదర్శకంగా అందిస్తున్న సుపరిపాలన చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు చేస్తున్న కుటిల రాజకీయాలకు మనమంతా స్వస్తి పలకాలి. 2024 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని ప్రతిపక్షాలకు తగిన గుణపాఠం చెప్పాలి.

– వాసుపల్లి గణేష్‌కుమార్, ఎమ్మెల్యే

ఆసరా సొమ్ముతో వ్యాపారం..

శ్రీరామ్ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిని. ఆసరా పథకం కింద ఒక్కొక్క విడతలో రూ.6 వేలు చొప్పున నాలుగు విడతల్లో రూ.24 వేలు సీఎం జగన్ రుణమాఫీ చేశారు. ఆ డబ్బుతో చిరు వ్యాపారం చేస్తున్నాను. అల్లిపురం బజార్లో కూరగాయలు విక్రయిస్తుంటాను. ఆ డబ్బుతో జీవనం సాగిస్తున్నాను. మాలాంటి పేదవారికి జగన్ ఎంతో సాయం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక పేదలు కూడా హాయిగా బతగ్గలుగుతున్నారు.

– భీమరశెట్టి వరలక్ష్మి, చిరువ్యాపారి, అల్లిపురం

జగన్ వల్లే పేదలు బతుకుతున్నారు..

నాకు రూ.15 వేలు చొప్పున నాలుగు విడతల్లో ఆసరా సాయం అందింది. ఆ సొమ్ముతో కుండల వ్యాపారం చేసుకుంటున్నాను. నా కుటుంబానికి ఆ వ్యాపారమే దిక్కు. నాలాంటి ఎంతో మందికి జగనన్న సాయం అందిస్తున్నారు. ఎన్నో పేద కుటుంబాలు ఆయన దయ వల్ల బతుకుతున్నాయి. అన్ని వర్గాలకు సాయం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. అప్పుడే పేదలంతా ఎలాంటి ఇబ్బంది లేకుండా బతుకుతారు.

– శ్రీకాకుళపు నాగమణి, కుమ్మరి, అల్లిపురం

జీవీఎంసీ దుకాణాలకు బహిరంగ వేలం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–8(వేపగుంట) పరిధిలో గల జీవీఎంసీ దుకాణాలు, మార్కెట్లను ఏడాది కాల పరిమితికి కాంట్రాక్ట్ ఇచ్చేందుకు మార్చి 2న బహిరంగ వేలం వేయనున్నట్టు జోనల్ కమిషనర్ హైమావతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు వేపగుంట జోనల్ కార్యాలయంలో నిబంధనలకు లోబడి కమిషనర్‌చే అనుమతి పొందిన వారితో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు వేలం పాటలో నిబంధనలకు లోబడి పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జోన్–8 కార్యాలయ పని వేళల్లో కార్యాలయ పర్యవేక్షకులను సంప్రదించాలన్నారు.

దుర్గాలమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అధికారులు

జగదాంబ : పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ అమ్మవారి జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి హుసేన్‌సాహెబ్ అన్నారు. మంగళవారం ఆయన దేవస్థానం చైర్మన్ నాయిని మల్లిబాబుతో కలిసి జీవీఎంసీ, పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్ క్లియర్ చేయాలన్నారు. అలాగే అగ్నిమాపక శకటాన్ని ఆలయం వద్ద ఉంచాలన్నారు. మార్చి 1న రాట ఉత్సవం, 7న తొలేళ్లు, 8న మహా శివరాత్రి, 9న వార్షిక జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య కార్మికులు పరిసరాలను పరిశుభ్రం చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా షామియానా, తాగునీరు, తక్షణ వైద్యం వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, ఎగ్జిక్యూటివ్ అధికారి శేఖర్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోడి దొరను పరామర్శించిన పీవో అభిషేక్



బోడి దొర యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో అభిషేక్

మహారాణిపేట : కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గాం గంటం దొర మనవడు బోడి దొరను పరామర్శించి, ఆయనకు అందుతున్న వైద్య సేవల గురించి అల్లూరి సీతారామరాజు జిల్లా ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వైద్యులను మంగళవారం అడిగి తెలుసుకున్నారు. రక్తం తక్కువగా ఉండటం వల్ల రెండవ సారి రక్తం ఎక్కించామని, నాలుగైదు రోజుల్లో కోలుకునే అవకాశం ఉందని వైద్యుడు డాక్టర్ సంపత్ తెలిపారు. కోలుకున్న తర్వాత వార్డులోకి మారుస్తామన్నారు. బోడి దొర స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబీకుడని ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు పీవో సూచించారు. గత శుక్రవారం జాతీయ అల్లూరి యువజన సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు సారథ్యంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ప్రతినిధుల బృందం పాడేరు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీతను కలసి బోడి దొరకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై పాడేరు పీవో అభిషేక్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న గాం గంటం దొర మనవడు బోడి దొరను పరామర్శించారు. సరైన సమయంలో స్పందించిన జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, శ్యామల వరలక్ష్మి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, చిట్టిబాబులను పీవో అభిషేక్ ప్రత్యేకంగా అభినందించారు. పీవో అభిషేక్ వెంట జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం అనుబంధ సంస్థ విశాఖ జిల్లా అల్లూరి గంటం, మల్లుదొరల సేవా సంఘం అధ్యక్షుడు శివంగి నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి పోతిన వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు గుంటు చిట్టిబాబు, కంబాల శంకరరావు ఉన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నా రు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

29న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 29న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

3న పల్స్ పోలియో



పల్స్ పోలియో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, ఇతర అధికారులు

మహారాణిపేట : మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదు సంవత్సరాలలోపు పిల్లల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో 2,08,163 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. 1002 పోలియో కేంద్రాలు, 74 మొబైల్ బృందాలు, 32 ట్రాన్సిట్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో 6,51,702 ఇళ్లను మార్చి 4,5 తేదీల్లో పరిశీలించి ఏ కారణం చేతనైనా పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులుంటే అటువంటి వారికి ఇంటి వద్దే పోలియో చుక్కలు వేస్తామన్నారు. జిల్లాలో 2,65,820 డోసుల వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ, వైద్యులు జగదీష్ ప్రసాద్, మురళీకృష్ణ, రవిశంకర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మహారాణిపేట : ఏపీ ఎన్‌జీవోలు చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం ఎన్‌జీవో హోమ్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఉద్యోగులు పాల్గొన్నారు. వివిధ సమస్యల సాధనకు ఆందోళన చేస్తున్న ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ధర్నా చేస్తున్న ఉద్యోగులను ఉద్దేశించి జేఏసీ జిల్లా కన్వీనర్, ఎన్‌జీవో సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్. రవిశంకర్ మాట్లాడుతూ చాలా కాలంగా ఉద్యోగుల డిమాండ్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరామన్నారు. కాని స్పందన లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో దశల వారీగా ఆందోళన చేస్తున్నామన్నారు. వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీనివాస్, ప్రసాదరావు, చంద్రశేఖర్, వై.ఎన్. ప్రసాద్, అప్పలరాజు, బోనం గోవింద తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.1.15 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఈవో రమాబాయి, స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, విజయలక్ష్మి

అల్లిపురం : అస్సాంగార్డెన్స్‌లోని శ్రీ నీలమ్మ వేప చెట్టు అమ్మవారికి రూ.1,15,257 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. మంగళవారం ఉదయం దేవాలయం ఆవరణలో స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, ఆలయ కమిటీ చైర్మన్ బొర్రా విజయలక్ష్మి సమక్షంలో హుండీలు తెరిచారు. ఆలయ ధర్మకర్తలు గంగా, లక్ష్మి, కాంతం, చంద్రకళ, శ్రీ హరి సేవా సంఘం సభ్యులు హుండీల లెక్కింపులో పాల్గొన్నారు.

రెజిమెంటల్ సెమెట్రీకి రక్షణ కల్పించాలి



సెమెట్రీని శుభ్రం చేస్తున్న వాల్తేర్ సెమెట్రీ సిబ్బంది

దాబాగార్డెన్స్ : జగదాంబ జంక్షన్‌లో గల రెజిమెంటల్ సెమెట్రీకి రక్షణ కల్పించాలని సెమెట్రీ అధ్యక్షుడు జార్జిఫీడి, కార్యదర్శి జి. మాథ్యూపీటర్ కోరారు. సెమెట్రీ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల వారు నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారాలు ఈ సెమెట్రీలో పడేస్తున్నారని, ఇది 1700 సంవత్సరంలో ఏర్పాటు చేసినందని తెలిపారు. ఇక్కడ అనేక మంది ప్రముఖుల సమాధులు ఉన్నాయని చెప్పారు. వాల్తేర్ సెమెట్రీకి అనుబంధంగా నిర్వహణ బాధ్యతలు చేపడతున్నామని, ప్రతి ఏటా రెండు, మూడు సార్లు పరిశుభ్రం చేస్తున్నామన్నారు. నిధులు లేమి కారణంగా సెమెట్రీ లోపల వ్యర్థాలు తొలగించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. బిచ్చగాళ్లు, కాగితాలు ఏరుకునేవారు టాయ్‌లెట్లుగా, వ్యర్థాలు వేయడానికి డంపింగ్ యార్డ్‌గా చూస్తున్నారని, పేకాట స్థావరంగా చేసుకుని జూదం ఆడుతున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జీవీఎంసీ కమిషనర్ చర్యలు చేపట్టి రెజిమెంటల్ సెమెట్రీకి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం వినతులు స్వీకరించారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో వివిధ కేడర్లలో పని చేస్తున్న స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు తమను రెగ్యులర్ చేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగుల్లా మినిమం టైం స్కేల్ అమలు చేయాలని అధికారులను కోరారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు దీనిపై సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులకు పంపి న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రెసిడెంట్ శశిభూషణ్, వైస్ ప్రెసిడెంట్ ఆర్.సురేష్, సెక్రటరీ వీరబ్రహ్మం, గోపీనాథ్, నాగరాజు, పీటీవీ సత్యనారాయణ, కె.వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎఫర్ట్ వార్షిక సదస్సుకు అపోలో వైద్యుడి కథనాలు

ఆరిలోవ: యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ అసోసియేషన్స్ ఆఫ్ ఆర్థోపెడిక్ అండ్ ట్రామాటాలజీ (ఈఎఫ్‌వోఆర్‌టీ) సదస్సుకు అపోలో వైద్యుడు డాక్టర్ డిఖాన్ నిర్వహించిన సర్జరీలకు సంబంధించిన రెండు శాస్త్రీయ కథనాలు ఆమోదం పొందాయి. జర్మనీలోని హాంబర్గ్‌లో మేలో జరిగే ఈఎఫ్‌వోఆర్‌టీ(ఎఫర్ట్) వార్షిక సదస్సు జరగనుందని డాక్టర్ డిఖాన్ తెలిపారు. దీనికి సంబంధించి ఈఎఫ్‌వోఆర్‌టీ నుంచి లేఖ వచ్చినట్లు ఆయన వెల్లడించారు. హగ్లండ్స్ వైకల్యం చికిత్సలో భాగంగా హిండ్‌ఫుట్ ఎండోస్కోపిక్ కాల్కానియోప్లాస్టీ విధానంలో శస్త్రచికిత్స చేసినట్లు చెప్పారు. ఈ వివరాలతో పంపించిన శాస్త్రీయ కథనాలు ఈఎఫ్‌వోఆర్‌టీ సదస్సుకు ఎంపికయ్యాయన్నారు. ఈ పద్ధతిలో శస్త్రచికిత్స చేయడం రాష్ట్రంలోనే మొట్టమొదటిదన్నారు. ఈ సందర్భంగా ఆయన్ని అపోలో వైద్యులు అభినందించారు.

వయోవృద్ధులకు ఉచితంగా ఉపకరణాలు



పేర్లు నమోదు చేయించుకుంటున్న వృద్ధులు

ఎంవీపీకాలనీ: రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకంలో భాగంగా వయోవృద్ధులకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేసేందుకు మంగళవారం పేర్లు నమోదు చేశారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాలరిపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖాధికారి జె.మాధవి, జీవీఎంసీ ఏపీడీ దుర్గాప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని 60 ఏళ్లు దాటిన వారి పేర్లు నమోదు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అలింకో, జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అర్హులైన వయోవృద్ధులకు కళ్లజోళ్లు, చెవి వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, ఊతకర్రలు, చంక కర్రలు, కృత్రిమ దంతాలు, ట్రైపాడ్స్ వంటి ఉపకరణాలను ఉచితంగా అందిస్తామన్నారు. వయోవృద్ధుల పేర్ల నమోదుకు నగర వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఒత్తిడిని జయిస్తే విజయం తథ్యం



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

టీచ్‌రోడ్డు: జాతీయ సేవా పథకం ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులు ఒత్తిడిని జయించడం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ ఎస్ఎల్ శంకర్ శాస్త్రి పాల్గొని విద్యార్థుల్లో ప్రేరణ కలిగించారు. ఎవరూ ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికా బద్ధంగా ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను చదివితే తప్పకుండా విజయం సాధిస్తారన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.